కథ

# తనకు మాలిన ధర్మం

**శశి సారధి**

నగరం నడిబొడ్డులో ఉన్న ఆ అపార్ట్‌మెంట్ బిల్డింగ్‌లో మూడు బ్లాకులలో, బ్లాకుకి ఇరవై అపార్టుమెంట్లు చొప్పున మొత్తం అరవై కుటుంబాలు నివాసం వుంటున్నాయి. కానీ, ఏ ఇంట్లో ఏ అవసరం వచ్చినా, 'ఎ' బ్లాకులో ఉన్న రాధిక పేరే అందరికీ గుర్తుకువస్తుంది. అక్కడకు ఎవరు కొత్తగా ఉండడానికి వచ్చినా, ముందుగా తెలిసేది రాధిక గురించే! ఇంతకీ ఏమిటి రాధికలోని ప్రత్యేకత? ఎందుకు ఆవిడ అంతగా పాపులర్ అయ్యింది అని ఎవ్వరైనా ఆరా తీస్తే వాళ్ళకి ఈ క్రింది విషయాలు తెలుస్తాయి.

రాధికది చాలా జాలిగుండె. ఎవరికి ఏ అవసరం వచ్చినా సహాయం చెయ్యడం తన ధర్మం అనుకునే మనిషి. చిన్నప్పటి నుంచీ అదే అలవాటు రాధికకు. స్కూలులో ఎవరికి పెన్సిలు, పెన్ను లాంటివి అవసరం వచ్చినా రాధిక దగ్గరకే వచ్చేవారు. ఒకసారి పరీక్షలప్పుడు ఎవరికో పెన్ను అవసరం వస్తే, తన దగ్గర ఒక్కటే ఉన్నా, కాదనలేక ఇచ్చేసింది. బిక్కముఖం వేసుకొని కూర్చున్న రాధికను చూసి, విషయం అర్థం చేసుకుని, తన పెన్ను ఇచ్చి పరీక్ష రాయించిన టీచరు "ఇలాంటి తనకుమాలిన ధర్మాలు చెయ్యకూడదని, తన దగ్గర రెండు పెన్నులు ఉంటే ఒకటి ఇయ్యవచ్చు గాని, ఇలా చేస్తే 'మంచమ్మాయి' అని పేరు వచ్చినా, చివరకు చాలా నష్టపోవలసి వస్తుందని చెప్పింది.

అప్పటికి తల ఆడించినా, తిరిగి తన పరోపకారాన్ని అలాగే కొనసాగించింది రాధిక. చెప్పి చెప్పి విసుగుపుట్టి, 'ఇంక నీ ఖర్మ' అనుకుంటూ, ఇంట్లో వాళ్ళు కూడా మానేశారు. అదిగో అలా చిన్నప్పటి నుంచీ పరోపకారాన్ని ఒళ్ళంతా రంగరించుకున్న 'దానకర్ణి' మన రాధిక.

ఇక వర్తమానంలోకి వస్తే, రాధిక భర్త రాజారావు గవర్నమెంటు ఉద్యోగి. వాళ్ళకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి ఏడో క్లాసు, అమ్మాయి ఐదో క్లాసు చదువుతున్నారు.

"పిల్లాడు ఏడో క్లాసు కామన్ పరీక్షలు రాయాలి. ఇంటి పట్టున ఉండి వాడి చదువు సంగతి చూడమని" భర్త ఎంత మొత్తుకున్నా, ఎప్పటిలాగే "అలాగేలెండి" అని ఆ టైముకి ఎవరైనా "రాధికగారూ! మా మిక్సీ పాడయ్యింది, ఏం చెయ్యాలో తోచడం లేదు" అంటే, "అయ్యో అలాగా, పప్పు తీసుకురండి. నేను రుబ్బి ఇస్తాను" అని ఆ పనిలో ఆవిడతో మాటలలో పడి, కొడుకు చదువుమాని టి.వి. చూస్తున్నాడని కూడా గమనించలేదు.

ఇంతలో చికెన్ గున్యా వ్యాధి ప్రబలింది. ఇంకేం! రాధికకి చేతినిండా పని. ఎక్కడలేని ఉత్సాహంతో తెలిసిన వాళ్ళకు, తెలియనివాళ్ళకు అందరికీ సేవ చెయ్యడం మొదలుపెట్టింది. ఇంతకుముందు ఇంట్లో పనంతా చేసుకుని బయటకు వెళ్ళేది. ఇప్పుడు బయటివాళ్ళకు తన అవసరం ఎక్కువ అవ్వడంతో ఇంట్లో వాళ్ళను పట్టించుకోవడం మానేసింది. దాంతో పిల్లలు చదువులో వెనకబడటం మొదలుపెట్టారు. ఒకరోజు ఇంట్లోకి వస్తుంటే, ఎదురింటిలో ఉండే లక్ష్మిగారు ఆపి "రాధికగారూ! మీ పిల్లలు స్కూలు నుంచి వచ్చి, పాపం కారిడార్లో తిరుగుతున్నారు. వాళ్ళింటికి వచ్చే టప్పటికైనా మీరు ఇంట్లో ఉంటే బాగుంటుందేమో!" అన్నారు. పైకి నవ్వినా, మనసులో చిర్రెత్తింది రాధికకు. 'నా సంగతి ఈవిడకెందుకు? అందరూ నాకోసం వస్తున్నారని కుళ్ళిపోతుంది' అనుకుంది.

ఇక పిల్లల పరిస్థితి... స్కూలు నుంచి రాగానే తల్లి ఏదైనా టిఫిన్ చేసి పెడితే తిని, హోమ్ వర్కులు చేసుకునే పిల్లలు, ఇప్పుడు తండ్రి వచ్చి అన్నం వండేవరకూ బిస్కట్లతో సరిపెట్టుకోవలసి వస్తుంది. ఇంక భోజనం చెయ్యగానే, నిద్ర ముంచుకు వచ్చేది. ఇలాంటి వాతావరణంలో సహజంగానే, పిల్లలు చదువుకు వెనకబడడంతో పాటు, ఆరోగ్యం కూడా పాడయ్యింది.


రాధిక భర్త రాజారావుకు అన్నింటికీ సర్దుకుపోయే తత్వం ఉంది. పెళ్ళైన కొత్తలోనే రాధిక స్వభావం పసిగట్టాడు. కానీ 'నేను ఆఫీసులో ఉన్నప్పుడు తను ఏం చేసుకుంటే నాకెందుకు?' అనుకునేవాడు. పిల్లలు పుట్టాక మాత్రం రాధిక కొద్దిగా పరోపకారాన్ని ప్రక్కకు పెట్టి, పిల్లల్ని చూసుకునేది. ఇంక పిల్లలు స్కూలుకి వెళ్ళడం మొదలుపెట్టాక రాధిక పరోపకారానికి మళ్ళీ రెక్కలు వచ్చాయి. పిల్లలు స్కూలుకి వెళ్ళిపోగానే, పరోపకారం చెయ్యడానికి ఎవరున్నారా? అని ఎదురు చూస్తుండేది. అందుకనే సహజంగానే ఎవరింట్లోనైనా, ఎవరికే అవసరం వచ్చినా ముందుగా రాధికే గుర్తుకు వచ్చేది.

కానీ, ఇప్పుడు ఇల్లంతా మార్కెట్ కింద తయారయ్యింది. ఏ వస్తువు కావాలన్నా, గంటసేపైనా వెతికితే గాని దొరకడం లేదు. అయినా రాజారావు మాత్రం భార్యను పల్లెత్తుమాట అనలేదు. ఒకసారి మాత్రం "పిల్లలు సరిగ్గా చదవడం లేదు రాధా! కొంచెం వాళ్ళ కోసం ఒక గంటైనా స్పేర్ చేస్తే బాగుంటుందేమో!" అని మాత్రం అన్నాడు. అప్పటికి "నిజమేనండి, రేపటి నుంచి వీళ్ళకి హోమ్‌వర్కులు చెయ్యించాకే ఎవరు పిలిచినా వెళ్ళేది" అని గట్టిగా చెప్పినా, ఆ టైముకి ఎవరైనా రాగానే అన్నీ మర్చిపోయి వెళ్ళిపోయేది.

ఈ సమస్యకు పరిష్కారం ఏమిటా అని తీవ్రంగా ఆలోచించాడు రాజారావు. అతనికి భార్యని బాధపెట్టడం ఇష్టంలేదు. అయినా ఆమె ఏమీ తప్పుపని చెయ్యడం లేదు. కానీ, మంచైనా అతి అయితే కష్టం కదా! అదే తనకి అర్థం అయ్యేలా ఎలా చెప్పాలి అని సతమతమయ్యాడు. ఇంతలో దేవుడే రాజారావు సమస్య తీర్చినట్లు, రాధిక చికెన్ గున్యాతో మంచం పట్టింది. ఆ రావడం చాలా ఎక్కువగా వచ్చిందేమో, కనీసం లేచి నడవలేకపోయింది. దానితో రాజారావు ఆఫీసుకి సెలవు పెట్టాడు. "మీరెందుకు సెలవు పెట్టారు? తెలిసిందంటే ఎవరో ఒకళ్ళు వచ్చి, నాకు చెయ్యకపోరు. వంటకి కూడా మీకేం ఇబ్బంది ఉండదు. ఎవరైనా వచ్చి, చేసే వెళ్తారు" ధీమాగా చెప్పింది రాధిక.

అలా రెండురోజులు గడిచిపోయాయి "ఎవరికీ తెలియలేదా? మీరు చెప్పారా? లేదా?" మూడోరోజు గట్టిగా అడిగింది. "ఎందుకు చెప్పలేదు. నీచేత సేవలు చెయ్యించుకుందామని వచ్చినవాళ్ళతో చెప్పాను. ఈపాటికి మొత్తం అన్ని ఇళ్ళవాళ్ళకి తెలిసే వుంటుంది" అన్నాడు.

'అరే ఇలా అయ్యిందేమిటి?' అని ఆశ్చర్యపోయింది రాధిక. సాయంత్రం ఇద్దరు, ముగ్గురు వచ్చి



చూసి వెళ్ళారు. "అయ్యో! మీరు పడుకున్నారా? మా ఇంట్లో ఫలానావాళ్ళకు బాగోలేదు. ఈ పని ఉంది, ఆ పని ఉంది అని చెప్పేవారేగానీ, సాయానికి ఎవరూ రాలేదు.

అదే సమయంలో పనిమనిషికి కూడా జ్వరం రావడంతో, రాజారావుకి పని బాగా ఎక్కువయ్యింది. అయినా ఏమాత్రం చిరాకు పడేవాడు కాదు. ఒకరోజు ఎదురింటావిడ వచ్చారు. పనిమనిషి లేదని చూసి, వెంటనే వాళ్ళ పనిమనిషిని పంపించారు. కూరలు కూడా ఆరోజు నుంచి పంపేవారు. అప్పుడప్పుడు వచ్చి కూర్చునేవారు. 'అయ్యో! ఈవిడనేనా! చాలా బడాయి ఎక్కువ అనుకునేదాన్ని' అనుకొని బాధపడింది రాధిక.

వారం తర్వాత ఎలాగో ఓపిక చేసుకుని లేచింది. బలవంతంగా భర్తని ఆఫీసుకి పంపించింది. సాయంకాలానికి విపరీతమైన నీరసం వచ్చింది. వాళ్ళ నాన్న చెప్పాడేమో, పిల్లలు స్కూలు నుంచి రాగానే బత్తాయి రసం తీసి ఇచ్చారు. 'వీళ్ళు స్కూలు నుంచి వచ్చేసరికి ఏమీ చేసేదాన్ని కాదు. ఇప్పుడు వీళ్ళచేత చెయ్యించుకోవల్సి వచ్చింది' అనుకుంటూ రాధిక మనసు తల్లడిల్లింది. పిల్లలే కుక్కర్ పెట్టారు. 'అవసరం మనిషి చేత ఎంత పనైనా చెయ్యిస్తుంది. అందుకే వీళ్ళింత త్వరగా అన్నీ నేర్చుకున్నారు' అనుకుంది. మంచం మీద నుంచి లేవబోతున్న రాధికతో "నువ్వు పడుకోమ్మా! పూర్తిగా తగ్గకుండా లేస్తే మోకాళ్ళనొప్పులు అలాగే ఉండిపోయాతాయంట" ఆరిందాలా చెప్పింది కూతురు. రాధిక తల్లిమనసు పిల్లల పట్ల ప్రేమతో నిండిపోయింది.

ఆరోజు రాత్రి పనంతా పూర్తయ్యాక, తన కాళ్ళకి అయొడెక్స్ మర్దనా చేస్తున్న భర్తతో, "నేనెంత పిచ్చిదాన్నండి. నా ఇల్లు వదలుకొని, అందరి ఇళ్ళూ చక్కబెట్టాను. ఇప్పుడు చూడండి, నాకు సాయానికి ఎవ్వరూ రాలేదు. ఎంత సమయం వృధా చేశాను" అంటూ బాధపడింది.

దానికి రాజారావు "అలా అనుకోకూడదు రాధా! ప్రతిఫలం ఆశించి ఎవ్వరికీ సాయం చెయ్యకూడదు. పరులకు సేవ చెయ్యాలనే తత్వం నీ రక్తంలో జీర్ణించుకుని ఉంది. ఎవరైనా బాధపడుతుంటే నువ్వు చూస్తూ ఊరుకోలేవు. అందరికీ అదే మోతాదులో పరోపకారం చెయ్యాలనే తపన ఉండదు కదా! అయినా నీదగ్గర సాయం పొందిన వాళ్ళందరికీ, ఇప్పుడు నిజంగానే ఏవైనా పనుల్నుయేమో! నేను చెప్పేది ఒక్కటే. నువ్వు సాయం చెయ్యి. నేను వద్దనడం లేదు. కానీ, మా బాగోగులు కూడా చూస్తుండు" అన్న భర్త చేతులను తన చేతులలోకి తీసుకుంటూ, "అవునండీ! నా తప్పు నాకు తెలిసింది. తనకుమాలిన ధర్మం చెయ్యకూడదు. అయినా ఇంగ్లీషులో ఒక సామెత ఉంది కదా! ఛారిటీ షుడ్ బిగిన్ ఎట్ హోమ్" అని అంటూ నవ్వింది.

అప్పటికి జ్ఞానోదయం అయినట్టు రాధిక మనసంతా తేలికగా ఉన్నా, ఏమో! రేపన్నది ఇంకో కొత్త కోణం. రాధికకు జ్వరం తగ్గి, ఓపిక కూడా వచ్చిన తర్వాత ఎవరైనా వచ్చి "రాధికగారూ!" అని పిలిస్తే, "ఓయ్ వస్తున్నా!" అని వెళ్ళకుండా ఉంటుందా?!